నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, బుధవారం 13 నవంబర్ 2024 | VIKARABAD




# మరో మూడు మున్సిపాలిటీలు

**రంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతం 13 మున్సిపాలిటీలు**

**త్వరలో కందుకూరు, మహేశ్వరం, చేవెళ్ల మున్సిపాలిటీలుగా రూపాంతరం**

రంగారెడ్డి, నవంబర్ 12 (నమస్తేతెలంగాణ) : రంగారెడ్డి జిల్లాలో కొత్తగా మరో మూడు మున్సిపాలిటీలు ఏర్పాటు కానున్నాయి. జిల్లా పరిధిలోని మేజర్ గ్రామపంచాయతీలైన కందుకూరు, మహేశ్వరం, చేవెళ్లలను మున్సిపాలిటీలుగా మార్చాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులు ఆయా మేజర్ గ్రామపంచాయతీల పూర్తి వివరాలను క్రోడీకరించి మున్సిపాలిటీలుగా మార్చడానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదికను పంపించారు. దీంతో ప్రస్తుతం జిల్లాలోని 13 మున్సిపాలిటీలకు తోడుగా మరో 3 మున్సిపాలిటీలు రానుండడంతో జిల్లాలో మున్సిపాలిటీల సంఖ్య 16కు చేరనున్నది. హైదరాబాద్ శివారు ప్రాంతాలైన మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు, మహేశ్వరంతోపాటు చేవెళ్లనూ మున్సిపాలిటీలుగా మార్చితే ఈ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందే అవకాశాలున్నాయని ప్రభుత్వం భావించింది. అలాగే, చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల హెడ్‌క్వార్టర్‌లు కూడా మున్సిపాలిటీలుగా మారనున్నాయి.

### చేవెళ్ల మున్సిపాలిటీలోకి వచ్చే గ్రామాలు..

చేవెళ్ల గ్రామపంచాయతీ పరిసరాల్లో ఉన్న కందవాడ, పలుగుపట్ల, మల్లారెడ్డిగూడ, మల్కాపూర్, కేసారం, ఇబ్రహీంపల్లి, దేవునిఎర్రవెల్లి, దామరగిద్ద, రామన్నగూడ, చేవెళ్ల గ్రామాలను కలిపి చేవెళ్ల మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

### మహేశ్వరం మున్సిపాలిటీ..

మహేశ్వరం గ్రామపంచాయతీ చుట్టుపక్కల ఉన్న మహేశ్వరం, తుమ్మలూరు, సిగిరిపురం, గంగారం, ఉప్పుగడ్డతండా, కేసీతండా, మోహబత్‌నగర్, ఎండీతండా, మన్సాన్‌పల్లి, గట్టుపల్లి, ఆకన్‌పల్లి, రాంచంద్రగూడ తదితర గ్రామాలను కలుపుతూ మహేశ్వరం మున్సిపాలిటీగా మార్చనున్నారు.

### కందుకూరు మున్సిపాలిటీ..

కందుకూరు గ్రామపంచాయతీ చుట్టుపక్కల ఉన్న కందుకూరు, కొత్తగూడం, కొత్తూరు, గూడూరు, బైరాగిగూడ, నేదునూరు, దెబ్బడగూడ, ఆకులమైలారం, మీర్‌ఖాన్‌పేట, బేగరికంచ, అన్నోజిగూడ, రాచులూరు, తిమ్మాపూర్, గుమ్మడవెల్లి, కటికపల్లి, జైత్వారం గ్రామాలను కలుపుతూ కందుకూరు మున్సిపాలిటీగా రూపాంతరం చెందనున్నది. అత్యధికంగా కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోకి 16 గ్రామపంచాయతీలు రానున్నాయి. ముఖ్యంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కందుకూరు మండలంలో ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్‌సిటీని దృష్టిలో ఉంచుకుని మీరఖాన్‌పేట, ఆకులమైలారం, బేగరికంచ తదితర గ్రామాలను కందుకూరు గ్రామపంచాయతీలో కలుపుతూ మున్సిపాలిటీగా మార్చే యోచనలో ప్రభుత్వం ఉన్నది. ముఖ్యంగా జిల్లాలోని హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఉన్న గ్రామాలను కలుపుతూ.. మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తున్నది.

### జిల్లాలో 16కు చేరనున్న మున్సిపాలిటీలు..

ప్రస్తుతం రంగారెడ్డిజిల్లాలో 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు ఉన్నాయి. వీటికితోడు కొత్తగా మరో 3 మున్సిపాలిటీలు ఏర్పాటవుతుండడంతో జిల్లాలో మున్సిపాలిటీల సంఖ్య 16కు చేరనున్నది. అలాగే, హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని శరవేగంగా అభివృద్ధి చెందుతున్న గ్రామాలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.


# షాడో నేతలపై చర్చ

## తోలుబొమ్మలుగా హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులు

**పైరవీలపై కింది స్థాయి సిబ్బంది, క్షేత్రస్థాయి అధికారుల అసహనం**

**షాడో నేత చెబితేనే ఫైళ్లు ముందుకు..**

సిటీబ్యూరో, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ) : షాడో నేతల వ్యవహారంపై హెచ్‌ఎండీఏలో విస్తృతంగా చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న పైరవీలపై కింది స్థాయి సిబ్బంది, క్షేత్రస్థాయి అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం పనులు జరగకుండా క్షేత్రస్థాయి సిబ్బందిని నియంత్రించడంపై హెచ్‌ఎండీఏ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎంఏయూడీలో కీలక బాధ్యతలు తీసుకున్న ఉన్నతాధికారి, ఇటీవల హెచ్‌ఎండీఏకు వచ్చిన మరో అధికారి వ్యవహారమే క్షేత్రస్థాయి సిబ్బందిని మరింత కలవరపెడుతోందని ఆవేదన చెందుతున్నారు. హెచ్‌ఎండీఏలోని కొందరు డైరెక్టర్లు, ఇంజినీరింగ్ ముఖ్య అధికారుల సాయంతో సదరు ఎంఏయూడీ అధికారి ఆడింది ఆటగా మారిందనే ఆరోపణలు ఉండగా, దానికి హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారి కూడా వంత పాడుతున్నారని సమాచారం. ఇటీవల డెవలప్‌మెంట్ పనుల వ్యవహారంలో కూడా షాడో నేత కలుగజేసుకుని, ఎంఏయూడీ ఉన్నతాధికారి సాయంతో ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిసింది. కొన్ని నిబంధనలను షాడో నేతల అనుమాయులకు అనుకూలంగా ఉండటంతో టెండర్ దక్కించుకోవడానికి సాయపడినట్లు హెచ్‌ఎండీఏలో చర్చ నడుస్తోంది. మొదటి నుంచి ఇంజినీరింగ్ విభాగంలో ఉండే ఓ ఉన్నతాధికారి వ్యవహారం కూడా షాడో నేతలు చెబితే పనిచేస్తున్నారని, అందుకు అనుగుణంగా ప్రమోషన్ దక్కిందనే ఆరోపణలు ఉన్నాయి. దీంతోపాటు ట్యాంక్ బండ్‌పై కోట్లు విలువ చేసే పార్కింగ్ దందాలోనూ సదరు ఉన్నతాధికారి పాత్ర ఉందని తెలిసింది. తాజాగా ప్లానింగ్ విభాగంలో కీలకమైన ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ విషయంలోనూ ఈ ఇద్దరూ అధికారుల చేతుల్లో వ్యవహారం జరిగినట్లు సమాచారం.



### తోలుబొమ్మలుగా ఉన్నతాధికారులు..

హెచ్‌ఎండీఏకు ఆదాయాన్ని సమకూర్చే వాటిలో ప్రధానమైనది ప్లానింగ్ విభాగం. ఇవాళ హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ కేంద్రీకృతమై, అంతర్జాతీయ స్థాయి పెట్టుబడులను ఆకర్షిస్తుందంటేనే దానికి ప్లానింగ్ విభాగమే కారణం. దీంతో హెచ్‌ఎండీఏను గుప్పిట్లో పెట్టుకున్నారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే ఇద్దరు ఉన్నతాధికారులకు హెచ్‌ఎండీఏను ప్రభుత్వం కట్టబెట్టింది. వీరినే తోలుబొమ్మలుగా చేసుకుని తమకు కావాల్సిన వ్యవహారాలను చక్కబెట్టేస్తున్నారని, అందులో భాగంగానే తాజాగా ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. అయితే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు క్లియరెన్స్ ఇస్తే హెచ్‌ఎండీఏకు ఆదాయం సమకూరినా.. తమ ఖాతాల్లోకి వచ్చే అవకాశం లేకపోవడంతోనే ఫైళ్ల విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకుంటున్నారని, బేరం కుదిరితే మోక్ష ద్వారాలు తెరుచుకుంటాయంటూ హెచ్‌ఎండీఏ అధికారులు చర్చించుకుంటున్నారు.

*ఫార్మా విలేజ్ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణంటూ వెళ్లిన అధికారులకు ఎదురు తిరిగిన లగచర్ల గ్రామస్తులపై పోలీసులు జులుం ప్రదర్శించారు. సోమవారం అర్ధరాత్రి కరెంట్ కట్ చేసి ఇండ్లల్లోకి చొరబడి దొరికినవారిని దొరికినట్టు అరెస్ట్ చేశారు. అధికారులపై జరిగిన దాడికి సంబంధం లేని అమాయకులు, మైనర్లను సైతం లాక్కెళ్లారు. భూములు లేనివారిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూములు కోల్పోతున్నామన్న ఆవేదనను అధికారులకు వ్యక్తం చేద్దామని అనుకుంటే, అనుకోని సంఘటన జరిగిందని బాధితులు పేర్కొంటున్నారు. గత పది నెలలుగా భూములివ్వబోమని ఆందోళనను వ్యక్తం చేస్తూ పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకుండా, రైతులను రెచ్చగొట్టేలా ప్రజాభిప్రాయ సేకరణంటూ సమావేశాలు నిర్వహించడం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఏదిఏమైనా భూములిచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెబుతున్నారు. అరెస్ట్ చేసిన వారిని భేషరతుగా విడుదల చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.*

*- కొడంగల్, నవంబర్ 12*

**లగచర్ల గ్రామంలో కరెంటు తీసేసి ఇండ్లలో సోదాలు**

**దాడికి సంబంధం లేనివారు అరెస్టు...**

**మహిళల హాహాకారాలు.. చిన్నారుల ఏడుపులు..అయినా ఆగని పోలీసులు**

**తెరచుకోని పాఠశాల.. వీధులన్నీ నిర్మానుష్యం..**

**ఫార్మా గ్రామాల్లో భయం..భయం..**



నిర్మానుష్యంగా మారిన లగచర్ల గ్రామం

# అర్ధరాత్రి అమానుషం..

### ఉలిక్కిపడ్డ గ్రామాలు..

లగచర్లలో జరిగిన ఘటన.. అర్ధరాత్రి పోలీసుల అరెస్టులతో మిగిలి ఫార్మా బాధిత గ్రామాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. మంగళవారం లగచర్లతోపాటు హకీంపేట, పోలేపల్లి, రోటిబండతండా, పులిచెర్లకుంటతండాల్లో నిర్మానుష్య వాతావరణం నెలకొన్నది. పల్లెల్లోని వృద్ధులు, మహిళలు బిక్కుబిక్కుమంటూ ఇండ్లల్లోనే ఉండిపోయారు. అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడం వల్లనే ఈ ఘటన జరిగిందని పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. దాడులకు పాల్పడిన వారిని వదిలేసి అర్ధరాత్రి ఇండ్లల్లో చొరబడి అరెస్టులు చేయడం ఏమిటని, మహిళలపై విచక్షణారహితంగా వ్యవహరించడం దారుణమని ఆరోపిస్తున్నారు.

### ఆవేదనే ఆవేశంగా..

భూములు పోతున్నాయన్న బాధతో గత పది నెలలుగా తిండి, నిద్ర లేదని ఫార్మా బాధిత రైతులు తెలిపారు. నిత్యం ఆవేదన, ఆందోళనతో కాలం గడుపుతున్నామన్నారు. రెక్కలుముక్కలు చేసుకుని భూములను కొనుగోలు చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి ఫార్మా అంటూ మా భూములను లాక్కోవడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫార్మా ఏర్పాటుకు భూములిచ్చే ప్రసక్తే లేదని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకుండా అభిప్రాయ సేకరణ అంటూ రావడంతో ఆవేదన కాస్త ఆవేశంగా మారిందని వాపోయారు. అధికారులపై దాడి చేయాలనే ఉద్దేశం లేదని, ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరుతున్నారు. లగచర్ల గ్రామంలో ఏ ఒక్కరిని పలకరించినా తమవారిని పోలీసులు లాక్కెళ్లారని కన్నీటిపర్యంతమవుతున్నారు.





యువకులను అరెస్ట్ చేయడంతో బిక్కుబిక్కుమంటూ కూర్చున్న మహిళలు, చిన్నారులు

### ఫార్మాకు భూమివ్వం..

కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మా కోసం పేదల భూములు గుంజుకోవాలని చూడడం బాధాకరమని, సీఎం రేవంత్‌రెడ్డి, అధికారులు తీరు వల్లే ఎదురు తిరగాల్సి వచ్చిందని ఫార్మా బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూములను తీసుకోండి.., పట్టా భూములను అప్పనంగా తీసుకుంటామంటే ఎలా ఒప్పుకోవాలని ప్రశ్నిస్తున్నారు. కడుపు కాల్చుకొని.. రెక్కలుముక్కలు చేసుకుని కొన్న పొలాలను కాపాడుకునేందుకు ఎంతటి ఉద్యమానికైనా సిద్ధమని తెలుపుతున్నారు. ఏదిఏమైనా భూములు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెబుతున్నారు.

### అర్ధరాత్రి అరెస్టులు దారుణం..

దాడుల సంఘటన మధ్యాహ్నం జరిగితే అప్పటి నుంచి అధికారులు ఎటువంటి చప్పుడు చేయకుండా అర్ధరాత్రి కరెంటు తీసి మరీ ఇండ్లల్లోకి చొరబడి అరెస్టులు చేయడం దారుణమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండాల్లో చాలా వరకు మగవాళ్లు ఉపాధి కోసం కూలీ చేసుకునేందుకు నగరానికి వెళ్లారని, మహిళలు, చిన్నారులు, వృద్ధులు మాత్రమే ఇండ్లల్లో ఉన్నారని తెలిపారు. ఎవరో చేసిన పాపానికి అమాయకులు సైతం బలయ్యారని, ఫార్మాకు సంబంధించి భూములు లేనివారిని అరెస్ట్ చేయడం ఎంత వరకు సమంజసమని గ్రామస్తులు ప్రశ్నించారు. పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరించారని, ఎవరితో చెప్పుకోవాలో అర్థం కావడం లేదని కన్నీటి పర్యంతమవుతున్నారు. రాత్రంతా భయం గుప్పిట్లో గడిపామని మహిళలు రోదిస్తున్నారు.

### సీఎంకు పేదోళ్ల భూములే కావాలా..

కంపెనీలు పెట్టాలంటే భూస్వాములు భూములో, సర్కారు భూములో తీసుకోవాలి. కానీ సీఎం రేవంత్‌రెడ్డికి మా పేదోళ్ల భూములే కావాలా..? మాకున్నదే ఎకరం పొలం.. దాన్ని సాగు చేస్తూ.. కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నం. మాకున్న ఆధారాన్ని లాక్కెళితే మేమెట్ల బతకాలె. ఏం తినాలె. మొగొళ్లు బతుకుదెరువుకని పట్టణాలకు పోయింద్రు. తండాలో ఆడోళ్లం, పిల్లలమే ఉన్నం. అర్ధరాత్రి ఇంట్లో చొరబడి దాడి చేయడం న్యాయం కాదు.

– చాందిబాయి, రోటిబండతండా, దుద్యాల మండలం



## కదిలిస్తే.. కన్నీరే..

లగచర్ల గ్రామంలో ఎవరిని కదిలించినా కన్నీరు మున్నీరవుతున్నారు...ముక్కోటి దేవుళ్లకు మొక్కితే లేక లేక కొడుకు పుట్టాడని.. మొదటి పుట్టిన రోజు జరుపుకుందామని అన్ని ఏర్పాట్లు చేసుకొని బంధు మిత్రులను పిల్చుకుంటే.. గొడవకు సంబంధం లేని తన భర్తను అర్ధరాత్రి పోలీసులు తీసుకెళ్లారని కన్నీరుమున్నీరైంది లగచెర్ల వాసి భాత్యశ్రీ...మాకు భూములు లేవని, గొడవతో సంబంధమే లేదని మొత్తుకున్నా పోలీసులు వినలేదని విలపించింది..కూతురు అన్న ప్రాసన కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుంటే తన భర్త నరేందర్‌ను పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారని అద్విక కన్నీరు పెట్టుకుంది. తమకు ఈ గ్రామంలో భూములే లేవని, గొడవ జరిగే సమయంలో తన భర్త అసలు ఈ ఊరిలోనే లేడని బతిమాలినా పోలీసులు వినిపించుకోలేదని ఆమె గుక్కపట్టి ఏడుస్తున్నది. ఉపాధికోసం ముంబై పోయామని, సంవత్సరానికి ఒకసారే ఊరికి వస్తామని, తన కొడుకు ఆరోగ్యం బాలేక సొంత గ్రామానికి వస్తే కరెంటు బంద్ చేసి పోలీసులు తీసుకుపోయారని మున్నిబాయి మొర పెట్టుకుంది.. ఫార్మా బాధిత గ్రామాల్లో ఇలాంటివి ఎన్నో బాధలు.. కాంగ్రెస్‌కు ఓటేసిన పాపానికి తమకు కన్నీరే మిగిలిందని చిన్నాపెద్దా తేడా లేకుండా కన్నీటి పర్యంతమవుతన్నారు.






విద్యార్థులు రాక వెలవెలబోతున్న పాఠశాల




# 'ఫార్మా'కు వ్యతిరేకంగా ఉద్యమానికి సిద్ధం

*'రంగారెడ్డి జిల్లాలో ఫార్మాసిటీ ఏర్పాటుకు ప్రభుత్వం భూములు సేకరించగా.. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు.. మేం అధికారంలోకి వస్తే ఎవరి భూములు వారికి తిరిగి ఇప్పిస్తామని, ఫార్మాసిటీని రద్దు చేస్తామని హామీ ఇచ్చారు.. తీరా అధికారంలోకి వచ్చాక రైతులకు సమాధానం చెప్పలేక మొహం చాటేస్తున్నారు..' అని జిల్లా రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది.*

*- రంగారెడ్డి, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ)*

జిల్లాలోని యాచారం, కందుకూరు మండలాల పరిధిలో ఏర్పాటు కానున్న ఫార్మాసిటీకి వ్యతిరేకంగా ఉద్యమం చేసేందుకు ఈ ప్రాంతవాసులు రంగం సిద్ధం చేశారు. రైతులతో పాటు స్వచ్ఛంద సంస్థలు, విద్యావంతులు, మేధావుల భాగస్వామ్యంతో 13 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. సమన్వయకర్త కోల సరస్వతి, కుందారపు నారాయణల ఆధ్వర్యంలో భవిష్యత్తు కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. ఫార్మా ఏర్పాటు కోసం గతంలో కుర్మిద్ద, మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి గ్రామాల్లో 14,029 ఎకరాల భూసేకరణ కూడా దాదాపుగా పూర్తయ్యింది. ఇందులో పట్టా భూములు 7,311 ఎకరాలు, ప్రభుత్వం భూములు 6,786 ఎకరాలుగా ఉన్నట్లుగా గుర్తించారు. కందుకూరు, కడ్తాల్ మండలాల్లో 13,500 ఎకరాల పట్టా భూములను సేకరించారు. అప్పట్లో ఫార్మాను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది. ఈ ఉద్యమానికి అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలుపడంతో అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి సైతం పొందింది.

**రంగారెడ్డి జిల్లాలో 'ఫార్మా'కు 19,333 ఎకరాల భూ సేకరణ**

**భూ పోరాటం చేసేందుకు 13 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు**

**ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వస్తే భూములిప్పిస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులు**

**గద్దెనెక్కాక మొహం చాటేస్తున్నారని రైతుల ఆగ్రహం**

### మొహం చాటేసిన కాంగ్రెస్ నాయకులు..

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు తాము అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని, భూములను తిరిగి రైతులకు ఇప్పిస్తామని హామీ ఇచ్చి విస్మరించారు. అధికారంలోకి వచ్చాక ఫార్మాసిటీని రద్దు చేయకపోగా, పెట్టుబడుల కోసం ప్రముఖ ఔషధ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నది. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ నాయకులను జిల్లా రైతులు నిలదీస్తుండడంతో తమకేమీ పట్టనట్లుగా పక్కకు తప్పుకుంటున్నారు. ఇదేనా కాంగ్రెస్ పార్టీ ఇచ్చే హామీకి విలువ అని ప్రశ్నిస్తుండడంతో మొహం చాటేస్తున్నారు. ఏదిఏమైనా మా భూములు మాకు కావాలని త్వరలో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ల కార్యాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని జిల్లా రైతులు పేర్కొంటున్నారు.